సాక్షి
ఖమ్మం
బుధవారం । 11 । డిసెంబర్ । 2024



ఖమ్మం వేదికగా...

సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి ఆర్చరీ, వాలీబాల్ పోటీలను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. 10లో



చిన్నారులకు అండగా నిలుస్తాం

తలసేమియా బారిన పడిన చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామని ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి తెలిపారు. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
29° / 19°

జిల్లాలో బుధవారం కనిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత చలిగాలుల తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే



సర్వే వివరాలు ఆరా తీస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్: ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు చేపడుతున్న సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. బోనకల్‌లో సర్వేను మంగళవారం ఆయన డీఆర్‌డీఏ పీడీ ఆర్.సన్యాసయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను పరిశీలించి పూర్తి సమాచారాన్ని యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రతిరోజు 30ఇళ్లకు తగ్గకుండా సర్వే చేయాలని చెప్పారు. కాగా, ఇళ్ల ఎంపికలో దివ్యాంగులు, వితంతు మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అనంతరం తహసీల్‌ను తనిఖీ చేసి ఆయన భవనం శిథిలావస్థలో ఉన్నందున మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రమాదేవి, ఏపీఓ కృష్ణకుమారి, ఎంపీఓ శాస్త్రి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా 4,604 దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదు గడువు ఈనెల 9వ తేదీతో ముగిసింది. తొలుత గత నెల 6వ తేదీ వరకే అవకాశం ఇవ్వగా ఆశించిన స్థాయిలో నమోదు కాని కారణంగా ఈనెల 9వరకు పొడిగించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 21 మండలాల పరిధిలో 4,604మంది ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 4,523 మంది ఆన్‌లైన్‌లో, 81మంది నేరుగా దరఖాస్తులు అందించారు. ఈ దరఖాస్తులను పరిశీలించి 30వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు.

ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ప్రభుత్వ, అనుబంధ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ సూచించారు. 5నుండి 8వ తరగతి వరకు బాలురకు ఏటా రూ.వెయ్యి, బాలికలకు రూ.1,500, రాజీవ్ విద్యాదీవెన ద్వారా 9, 10వ తరగతి విద్యార్థులకు ఏటా రూ.3వేలు అందుతాయని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మీ సేవ నుండి తీసుకున్న కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు బోనఫైడ్ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ పత్రాలను జత చేసి పాఠశాల ద్వారా తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 98486 74535(ఖమ్మం డివిజన్), 94405 81134, 99512 32149(మధిర, సత్తుపల్లి డివిజన్లు)తో పాటు కార్యాలయాన్ని 63023 09725 నంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

నాలుగు పీహెచ్‌సీలకు భవనాల కోసం ప్రతిపాదనలు

నేలకొండపల్లి: జిల్లాలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి.కళావతిబాయి తెలిపారు. నేలకొండపల్లిలోని పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేసిన ఆమె రికార్డులను పరిశీలించడంతో పాటు చికిత్స కోసం వచ్చిన వారి నుంచి వివరాలు సేకరించారు. అలాగే, సాధ్యమైనంత మేర స్థానికంగానే వైద్యసేవలు అందిస్తూ అత్యవసరమైతేనే ఖమ్మం రిఫర్ చేయాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం డీఎంహెచ్ ఓ మాట్లాడుతూ వైరా, నేలకొండపల్లి, మధిర, పాతర్లపాడులో పీహెచ్‌సీ భవనాలకు నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. కాగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక చికిత్స అందుతున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ముగిసిన సైన్స్ సంబురం..

ఖమ్మం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శన మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సైన్స్ ఫేర్‌కు వివిధ పాఠశాలల తరపున 530 ఎగ్జిబిట్లు, 119 ఇన్‌స్పైర్ ప్రదర్శనలు ఏర్పాటుచేయగా పలు పాఠశాలల విద్యార్థులు పరిశీలించారు. ప్రతీ ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తూ దాని ప్రత్యేకతలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కాగా, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, జెడ్పీ సీఈఓ దీక్షారైనా ఎగ్జిబిట్లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. – ఖమ్మంసహకారనగర్

ప్రదర్శనలను తిలకిస్తున్న వివిధ పాఠశాలల విద్యార్థులు



- ఆకట్టుకున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలు
- బారులుదీరి తిలకించిన విద్యార్థులు
- రాష్ట్ర స్థాయి పోటీలకు 26 ఎగ్జిబిట్ల ఎంపిక

వైజ్ఞానిక దృక్పథం పెంపునకు....

సైన్స్‌ఫేర్ ముగింపు సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో వైజ్ఞానిక దృక్పథం పెరుగుతుందని తెలిపారు. ఇందులో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. సీఎస్ఐఆర్ సీనియర్ శాస్త్రవేత్త చినరాజు మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ దక్పథం, ప్రశ్నించేతత్వం పెంపొందిస్తే భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. కాగా, 530 ఎగ్జిబిట్లలో 14, ఇన్‌స్పైర్ ఎగ్జిబిట్లు 119లో 12 ప్రదర్శనలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయగా వీటిని రూపొందించిన విద్యార్థులు, గైడ్ టీచర్లకు పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేశారు. కాగా, సైన్స్‌ఫేర్ నిర్వహణకు ప్రాంగణం అందజేసిన ఎస్ఎఫ్ఎస్ పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ రాజారెడ్డి, విద్యార్థులకు, గైడ్ టీచర్లకు భోజన వసతి కల్పించిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల కమిటీకి డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ కే.వీ.శైలజాలక్ష్మి డీఎస్ఓ జగదీష్ కృతజ్ఞతలు తెలిపారు.



ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ దీక్షారైనా



రాష్ట్రస్థాయికి ఎంపికైన మధిర మండలం ఇల్లూరు విద్యార్థి జగదీష్, గైడ్ టీచర్ రషీద్‌కు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, డీఈఓ శర్మ

ముక్కోటి ఏర్పాట్లు పూర్తి చేయండి



మాట్లాడుతున్న భద్రాద్రి జిల్లా కలెక్టర్ పాటిల్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, అధికారులు

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- ఉత్సవాలకు అనుసంధానంగా పర్యాటకాభివృద్ధి
- అధికారులతో సమీక్షలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జనవరి 10న ముక్కోటి ఏకాదశి వేడుకల నిర్వహణకు అవసరమైన పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులకు సూచించారు. సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయన జిల్లాస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనుల్లో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూడాలన్నారు. వేడుకల ఏర్పాట్ల పర్యవేక్షణను భద్రాచలం ఆర్డీఓ, బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ శాఖ సంయుక్తంగా చేపట్టాలన్నారు. లాడ్జీలు, హోటళ్ల యజమానులతో సమావేశం నిర్వహించి ధరలు నిర్ణయించాలని ఆర్డీఓకు సూచించారు. ఆలయ పరిసరాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలన్నారు. భద్రాచలంతో పాటు పర్ణశాల ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఉత్తర ద్వార దర్శన మహోత్సవాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయాలని, తెప్పోత్సవానికి హంస వాహనాన్ని తనిఖీ చేసి ధ్రువీకరణ నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ ఈఈకి సూచించారు. హంస వాహనంలోకి పరిమిత సంఖ్యలోనే అనుమతించాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని అన్నారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి నివేదిక అందజేయాలని ఆహార తనిఖీ, తూనికలు కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. భద్రాచలం, పర్ణశాలలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని, బస్సులు, రైల్వే సమయాలతో పాటు జిల్లాలోని ప్రముఖ దర్శనీయ స్థలాలను తెలియజేసేలా చార్టులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కరకట్ట వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయడంలో అలసత్వం వహించిన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో గుంతలు పడిన రోడ్డును రెండు రోజుల్లో పూడ్చాలని కలెక్టర్ ఆదేశించారు.

పర్యాటకాభివృద్ధికి కృషి చేయండి..

ముక్కోటి ఉత్సవాలకు అనుసంధానంగా భద్రాచలాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేలా ప్రణాళిక రూపొందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. భద్రాద్రి ప్రాముఖ్యతపై రాష్ట్రస్థాయి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన సంప్రదాయ వంటకాలు, వస్తువులు ప్రతిబింబించేలా స్టాళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో భద్రాచలం ప్రాముఖ్యత తెలిపేలా వాల్‌పోస్టర్లు వేసేందుకు ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. అలాగే, భద్రాచలంలోని గిరిజన మ్యూజియం, దుమ్ముగూడెంలో గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాట్లు, కిన్నెరసానిలో పుట్టి ప్రయాణం, కాటేజీల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, ఆలయ ఈఓ రమాదేవి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' కాజేసేలా పన్నాగం



- నకిలీ ధ్రువపత్రాలతో దరఖాస్తు
- ఎమ్మెల్యే కార్యాలయ ఉద్యోగి గుర్తించడంతో అడ్డుకట్ట

వైరా: ఇప్పటికే పలు మండలాల్లో ప్రభుత్వ అధికారుల దృష్టి మరల్చి నకిలీ పత్రాలతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు తీసుకుంటున్న సదరు వ్యక్తి వైరాలోనూ అలాగే చేసేందుకు ప్రయత్నించాడు. కానీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఉద్యోగి అప్రమత్తతతో విషయం వెలుగు చూసింది. పోలీసులు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాలు... కొణిజర్ల మండలం అంజనాపురానికి చెందిన బి.వెంకన్న ఈ ఏడాది మార్చి 24న కల్యాణలక్ష్మి ద్వారా ఆర్థికసాయం కోసం నకిలీ పత్రాలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, తహసీల్‌లో దరఖాస్తు అందించాడు. వధువు వైరాలోని 14వ వార్డులో నివాసం ఉంటున్నట్లు, వరుడు పెనుబల్లి మండలం అడవిమల్లెలకు చెందిన మూడ్‌సోమ్లా నాయక్ అని అందులో పొందుపర్చాడు. నకిలీ ఆధార్, పెండ్లి కార్డు, ఎస్సెస్సీ మెమో, రేషన్ కార్డు, వివాహ సర్టిఫికెట్ ఇలా అన్నీ నకిలీ పత్రాలు సమర్పించాడు. అయితే, వైరా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఎలా పరిశీలించారో ఏమో తెలియదు కానీ అంతా బాగానే ఉందంటూ మంజూరుకు సిఫారసు చేశారు. కాగా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇన్‌చార్జ్ గుగులోత్ రాము సైతం వైరా 14వ వార్డులో నివాసం ఉంటుండడంతో ఆయనకు అనుమానం వచ్చింది. ఈ మేరకు వివరాలు ఆరాతీయగా నకిలీ ధ్రువపత్రాలతో కల్యాణలక్ష్మి కోసం దరఖాస్తు చేసినట్లు తేలింది. ఈమేరకు రెవెన్యూ ఉద్యోగులతో కలిసి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వెంకన్న గతంలో వైరా మండలం సిరిపురం గ్రామంలో మీ సేవ సెంటర్ నిర్వహించగా, ప్రస్తుతం పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. అయితే, రెవెన్యూ సిబ్బంది దరఖాస్తు పరిశీలన సమయాన ధ్రువపత్రాలు నకిలీవని గుర్తించకపోవడంపై అనుమానాలు వెలువెత్తుతున్నాయి.

పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు వెల్లడించండి

ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి విడుదల చేసిన పోలింగ్ స్టేషన్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే వెల్లడించాలని ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వారు వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ, డీపీఓ మాట్లాడుతూ గ్రామాలు, వార్డుల వారీగా ఓటర్లు ఇబ్బంది పడకుండా పోలింగ్‌స్టేషన్లు గుర్తించామని తెలిపారు. ఇందులో అభ్యంతరాలు ఉంటే ఈనెల 12 వరకు తెలియజేయాలని చెప్పారు. కాగా, కొందరికి గ్రామాలతో పాటు పట్టణాల్లో ఓట్లు ఉన్నందున పరిశీలించాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు మొక్కా శేఖర్‌గౌడ్, ఆవుల అశోక్, బచ్చలకూర ఝాన్సీ, విద్యాసాగర్‌రావు, నున్నా రవి, పొన్నం వెంకటేశ్వర్లు, తాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న డీఆర్‌డీఓ సన్యాసయ్య, డీపీఓ ఆశాలత తదితరులు

పర్సంటేజీలే ప్రధానం..

- ఖజానా శాఖ ఉద్యోగుల తీరుపై విమర్శలు
- ఏ పని కోసం వచ్చినా మామూళ్లు సమర్పించాల్సిందే..
- తాజాగా ఉద్యోగి ఏసీబీకి పట్టుబడడంతో శాఖలో అలజడి



ఖజానా శాఖ కార్యాలయంలోని పెన్షన్ల విభాగం

ఖమ్మం సహకారనగర్: నిత్యం కలెక్టర్ సహా ఉన్నతాధికారులు వచ్చివెళ్లే కలెక్టరేట్.. అంతేకాక తరచుగా మంత్రుల సమీక్షలు జరుగుతుంటాయి. ఇదే కలెక్టరేట్‌లో కొనసాగుతున్న జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడుతుండడం గమనార్హం. ఈ కార్యాలయ పరిధిలోని ఖమ్మం సబ్ ట్రెజరీ కార్యాలయంలో సోమవారం తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు ఓ పెన్షనర్ భార్య నుంచి రూ.40వేలు డిమాండ్ చేసిన సీనియర్ అసిస్టెంట్ నగేష్‌ను అదుపులోకి తీసుకోవడం తెలిసిందే. ఈ ఘటన ఖజానా శాఖలోనే కాక కలెక్టరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

ఉద్యోగవర్గాల్లో కలకలం

జిల్లా ఖజానా శాఖ కార్యాలయం కలెక్టరేట్‌లో ఉండగా... ఇందులోనే ఖమ్మం సబ్ ట్రెజరీ కార్యాలయం కొనసాగుతోంది. అలాగే, వైరాలో అసిస్టెంట్ ట్రెజరీ కార్యాలయం(ఏటీఓ), మధిర, నేలకొండపల్లి, సత్తుపల్లిలో సబ్ ట్రెజరీ కార్యాలయాలు ఉన్నాయి. మొత్తంగా శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌తో పాటు ముగ్గురు అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్లు(ఏటీఓలు), తొమ్మిది మంది సబ్‌ట్రెజరీ ఆఫీసర్లు(ఎస్‌టీఓ), 22మంది సీనియర్ అకౌంటెంట్లు, 17మంది జూనియర్ అకౌంటెంట్లు, నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇద్దరు డ్రైవేజ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. అన్ని శాఖల ఉద్యోగులు, కాంట్రాక్టర్లు వివిధ పనుల నిమిత్తం ఈ కార్యాలయాలకు వస్తుంటారు. ఈనేపథ్యాన వారి అవసరాలను ఆసరాగా తీసుకుంటున్న ఉద్యోగులు కొందరు మామూళ్ల కోసం వేధిస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది తీరును బహిరంగంగానే పలువురు తప్పుపడుతున్నారు. కొందరైతే పర్సంటేజీ చెల్లించకుండా ఫైల్‌పై సంతకం కూడా చేయడం లేదని చెబుతున్నారు. ఎదుటి వారి ఆవేదనతో సంబంధం లేకుండా మామూళ్ల డిమాండ్ చేస్తుంటారని తెలుస్తోంది.

సొంత శాఖ ఉద్యోగులకూ తిప్పలే..

ఇతర శాఖల ఉద్యోగులను పర్సంటేజీల పేరుతో వేధించే ఖజానా శాఖ ఉద్యోగులు సొంత శాఖ సిబ్బందినీ వదలరని తెలుస్తోంది. జిల్లాలోని ఓ ఎస్‌టీఓ ఇటీవల సెలవులో వెళ్లగా మరో ఎస్‌టీఓకు ఆ బాధ్యతలు అప్పగించారు. కానీ ఆయన సుదూర ప్రాంతం కావడంతో డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరగా ఓ అధికారి నగదు వసూలు చేశారని తెలిసింది. అలాగే, కొన్నేళ్ల క్రితం గ్రూప్–2లో ఎంపికైన ఉద్యోగికి సంబంధించి పే ఫిక్సేషన్ చేసే క్రమాన సైతం లంచం తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల ఒక సబ్ ట్రెజరీ కార్యాలయానికి డిప్యూటేషన్ వేయించుకునేందుకు ఇంకో ఉద్యోగి కొంత మేర నగదును అధికారికి అప్పగించినట్లు తెలిసింది. ఇలా కార్యాలయంలోని కొందరు అధికారులు, ఉద్యోగులు డిప్యూటేషన్లు, ఇతర అంశాల్లో భారీగా వసూళ్లకు పాల్పడుతున్నట్లు శాఖలో చర్చ జరుగుతోంది.

తీరు మార్చుకోండి...

ఖజానా శాఖ ఉద్యోగి ఏసీబీకి పట్టుబడిన నేపథ్యాన జిల్లా ఖజానా శాఖ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ నర్సింహం మంగళవారం శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షించినట్లు తెలిసింది. అధికారులు, ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించినట్లు సమాచారం. ఎవరైనా అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించినట్లు తెలిసింది.

నీరు సాఫీగా సాగేదెలా?!

- ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని సాగర్ కాల్వలు
- అడ్డంకులతో చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- శాశ్వత మరమ్మతులు, నిర్వహణపై దృష్టి లేక రైతుల ఇక్కట్లు



అల్లీపురం వద్ద కాల్వ మూసుకుపోవడంతో అరకొరగా సాగుతున్న సాగర్ నీరు



పొద్దుటూరు వద్ద మేజర్ కాల్వ పరిస్థితి (ఫైల్)

ఖమ్మంఅర్బన్: ప్రాజెక్టుల్లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ కాల్వల నిర్వహణ సక్రమంగా లేక జలాలు ముందుకు సాగకపోవడంతో పొలాలకు చేరడం లేదు. దీంతో ప్రతీ సీజన్‌లో చివరి ఆయకట్టు రైతులు నష్టపోవాల్సి వస్తోంది. జిల్లాలోని కాల్వలకు జలవనరులశాఖ ఆధ్వర్యాన గత పదిహేనేళ్లుగా ఎలాంటి మరమ్మతులు, పూడికతీత, కంపచెట్లు తొలగింపు పనులు చేపట్టలేదు. దీంతో చాలాచోట్ల కాల్వల ఆనవాళ్లు కోల్పోగా.. అరకొరగానే నీరు పారుతోంది.

2.54 లక్షల ఎకరాల ఆయకట్టు

జిల్లాలోని 17 మండలాల పరిధిలో సాగర్ ప్రధాన కాల్వ విస్తరించి ఉంది. తొలినాళ్లలో 2.54 లక్షల ఎకరాలకు పైగా వరి, ఆరుతడి పంటలకు నీరందించేలా కాల్వలను డిజైన్ చేశారు. అందుకు అనుగుణంగా ప్రధాన కాల్వ, అనుబంధంగా బ్రాంచ్ కాల్వలు, మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్ల ద్వారా నీటి సరఫరా సాగిస్తున్నారు. జిల్లాలో ప్రధాన కాల్వ సుమారు 148 కి.మీ. మేర ఉండగా.. బోనకల్లు, మధిర, మైలవరం బ్రాంచ్ కాల్వలు 80 కి.మీ., మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లు సుమారు 4వేల కి.మీ.కు పైగానే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.వేల కోట్ల నిధులతో ప్రధాన కాల్వను ఆధునికీకరించారు. ఆ తర్వాత కాల్వల నిర్వహణ, మరమ్మతులపై ఎవరూ దృష్టి సారించకపోవడంతో ఏటా నీరు విడుదల చేస్తున్నా సాఫీగా సాగడం లేదు.

ఎవరు పర్యవేక్షించాలి?

కాల్వల ద్వారా నీటి సరఫరాలో ఎక్కడైనా చిన్నచిన్న సమస్యలు ఎదురైతే గతంలో లష్కర్లు., రైతుల సాయంతో మరమ్మతులు చేసేవారు. కానీ కాలక్రమంలో లష్కర్ల నియామకం జరగకపోవడం, ఉన్న వారు ఉద్యోగం విరమణ చేస్తుండడంతో వందల్లో ఉండే వారు ఇప్పుడు పదుల సంఖ్యలోకి చేరారు. ఫలితంగా కాలం కలిసొచ్చి రైతుల అదృష్టం ఉంటే తప్ప చివరి ఆయకట్టుకు నీరు చేరే పరిస్థితులు కానరావడం లేదు. గతంలో ప్రధాన కాల్వతో పాటు ఒకటి, రెండు బ్రాంచ్ కాల్వల ఆధునికీకరణకు వచ్చిన నిధులతో బాగుచేశారే తప్ప ఇతర ఏ కాల్వల నిర్వహణను పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో పంటలకు నీరు అందించాల్సిన కాల్వల్లో పూడిక, కంపచెట్లు పెరిగి.. కట్టలు కుంగి గందరగోళంగా మారాయి. ఫలితంగా ఎంత నీరు విడుదల చేసినా అరకొరగానే పంట పొలాలకు చేరుతోంది.

ఉపాధి పనుల్లో అక్కడక్కడ...

ఉపాధి హామీ పథకం ద్వారా వేసవిలో కూలీలకు పనులు కల్పించాలనే భావనతో పంట కాల్వ(సబ్ మైనర్లు)ల్లో పూడిక, కంపచెట్ల తొలగింపు పనులు అక్కడక్కడ అరకొరగా చేపడుతున్నారు. అయితే, ఈ పనులపై కూలీలకు అవగాహన లేకపోవడం, అటు అధికారుల పర్యవేక్షణ లేక వీటి వల్ల రైతులకు పెద్దగా ఉపయోగడం ఉండడం లేదు. కనీస మరమ్మతులు చేయించి ఎప్పటికప్పుడు నిర్వహణపై దృష్టి సారిస్తే నీరు వృథా కాదని, ఎక్కువ ఆయకట్టుకు అందుతుందని తెలిసినా అటు పాలకులు, ఇటు అధికారులు ప్రణాళికాయుతంగా వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి మేజర్లు, మైనర్లు, సబ్ మైనర్లను మండలాల వారీగా మరమ్మతు చేయిస్తే తప్ప సాగర్ జలాలు చివరి ఆయకట్టు వరకు అందే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

పంటకాలం పూర్తయ్యాక పనులు

ఈ ఏడాది రబీ పంట కాలం పూర్తయ్యాక కాల్వల మరమ్మతు చేయిస్తాం. ఇప్పటికే మేజర్లు, మైనర్ల పరిధిలో పనులకు అనుమతి లభించింది. ప్రస్తుతం నీరు విడుదల చేస్తున్నందున పనులు చేయడం =సాధ్యం కాదు. అయినా సాధ్యమైనంత మేర రైతులకు ఇబ్బంది ఎదురుకాకుండా నీటి సరఫరా కొనసాగిస్తున్నాం. మేజర్, మైనర్లు మినహా పంట కాల్వలను మాత్రం రైతులే బాగు చేసుకోవాల్సి ఉంటుంది.

– విద్యాసాగర్, సీఈ, జలవనరుల శాఖ

క్లుప్తంగా

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

ఖమ్మం సహకారనగర్: సమగ్ర శిక్షా ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకొని వారి సమస్యలు పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వీ.నాగేశ్వరరావు, ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నాచౌక్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగుల రిలే నిరసన దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. రోజుల తరబడి ఉద్యోగులు నిరసన తెలుపుతున్నా పట్టించుకోవడం సరికాదన్నారు. ఇకనైనా మినిమం టైం స్కేల్ వర్తింపచేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉమాదేవి, వెంకటేశ్వర్లు, బాషనస్, విజయ, నిర్మల, అనిల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేఎంసీ స్థాయి క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలు బుధవారం నుంచి నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్ కబడ్డీ, ఖో-ఖో, యోగా క్రీడాంశాల్లో సర్దార్ పటేల్ స్టేడియంలో మూడు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. వాలీబాల్ అండర్-18 కేటగిరీలో, అథ్లెటిక్స్ పోటీలు అండర్-14, 20 20 విభాగాల్లో జరుగుతాయి. కాగా, బుధవారం ఉదయం 9గంటలకు పోటీలు మొదలవుతాయని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు.

నాణ్యమైన బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికులు, ఉద్యోగులు సమష్టి కృషితో లక్ష్యం మేర నాణ్యమైన బొగ్గు ఉత్పత్తిపై దృష్టి సారించాలని మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్ సభ్యులు సూచించారు. కొత్తగూడెం ఏరి యా జీఎం షాలేంరాజు ఆధ్వర్యాన సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మట్లాడారు. రక్షణ చర్యలు తీసుకుంటూనే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకో వాలన్నారు. అనంతరం డీజీఎం యోహాన్ ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల పనితీరు, ఉద్యోగుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించా రు. ఈ కార్యక్రమంలో పీఓ ప్రహ్లాద్, కమిటీ సభ్యులు కె.హనుమలత, యోహాన్, శివకేశవరావు, సూర్యనారాయణరాజు, డి.శ్రీనివాసరావు, నర్సింహారావు, రమాకాంత్, దేవదాస్, పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మం లీగల్: చట్టాలపై పౌరులంతా అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ఆత్మ విశ్వాసం పెరిగి బలోపేతం అవుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్ తెలిపారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీలో మంగళవారం సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలని, ప్రజా అవసరాలకు అనుగుణంగా అధికారులు స్పందించక పోతే న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావొచ్చని తెలిపారు. ఈక్రమంలో పేదలకు ఉచిత న్యాయ సాయం అందిస్తామని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ మహ్మద్ జకీరుల్లా మాట్లాడగా హరిప్రసాద్రావు, శ్రీనివాస్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

'డ్రమ్ సీడర్'తో వరిలో అధిక దిగుబడి

తిరుమలాయపాలెం: డ్రమ్‌సీడర్ విధానంతో వరి సాగు చేయడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడి సాధించొచ్చనని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య తెలిపారు. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడులో వరిసాగులో డ్రమ్‌సీడర్ ద్వారా వరి సాగుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ కూలీల కొరత ఉన్న నేపథ్యాన ఈ విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే, వరి కోతలు పూర్తయ్యాక మోడులు కాల్చొద్దని, అలా చేస్తే భూమిలోని సూక్ష్మజీవులు నశించి భూసారం తగ్గుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఆయన రైతులు, నిర్వాహకులకు సూచనలు చేశారు. కూసుమంచి ఏడీఏ సరిత, ఏఓ నారెడ్డి సీతారాంరెడ్డి ఏఈఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

తహసీల్దార్ నోటీసుల పేరుతో వసూళ్లు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 7వ డివిజన్ టేకులపల్లిలోని కేసీఆర్ టవర్స్ సముదాయం డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉంటున్న కొందరికి తహసీల్దార్ పేరిట నోటీసులు ఇస్తున్న దళారులు వసూళ్లకు తెర లేపినట్లు తెలిసింది. ఇల్లు కేటాయించిన వారు కాకుండా ఇతరులు ఉంటున్నారని, ఇంకొన్నింటికి తాళాలు వేసినందున వాటిని రద్దు చేస్తామని చెబుతూ నకిలీ నోటీసులు విడుదల చేసినట్లు సమాచారం. వీటిపై కార్యాలయం ముద్ర లేకపోగా నకిలీవని గుర్తించని పలువురు ఆందోళన చెందుతుండడాన్ని ఆసరాగా చేసుకున్న దళారులు రూ.30వేల నుంచి రూ.40వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ వి.రవికుమార్‌ను వివరణ కోరగా తన కంటే ముందు పనిచేసిన తహసీల్దార్ తాళం వేసిన ఇళ్ల యజమానులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసిందన్నారు. ఇప్పుడు మాత్రం ఎవరికీ ఇవ్వలేదని, నకిలీ నోటీసులతో ఎవరైనా వసూళ్లకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి..

- ఇన్‌స్పైర్‌లో 12 ఎగ్జిబిట్ల ఎంపిక
- సైన్స్ ఫేర్‌లో 14 ప్రదర్శనలను ఎంపిక చేసిన అధికారులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన జల్లేపల్లి హైస్కూల్ విద్యార్థి అక్షిత, గైడ్ టీచర్ నళిని

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం బల్లేపల్లిలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ ప్రదర్శన మంగళవారం ముగియగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇన్‌స్పైర్ విభాగంలో 12, సైన్స్‌ఫేర్‌లో 16 ప్రదర్శనలను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా ఎగ్జిబిట్ల వివరాలు ఇలా ఉన్నాయి. కాగా, సైన్స్‌ఫేర్‌లో బురదరాఘవాపురం జెడ్పీహెచ్ఎస్ నుంచి ఐదు ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికవడం విశేషం.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఇన్‌స్పైర్‌లో....

విద్యార్థి	పాఠశాల	ప్రదర్శన అంశం
పి.వినీషారెడ్డి	నిర్మల్ హృదయ స్కూల్, ఖమ్మం	పాఠశాలల్లో వృథా పేపర్ల రీసైక్లింగ్
వి.విష్ణుషణ్ముఖ	త్రివేణి టాలెంట్ స్కూల్, ఖమ్మం	స్మార్ట్ వీల్ చైర్
డి.సిందూర	టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, కూసుమంచి	సేఫ్ జీబ్రా క్రాసింగ్ గ్రిడ్
సీహెచ్.అన్విత	రెజొనెన్స్ స్కూల్, ఖమ్మం	ఫుట్‌ప్రెస్ న్యూమాటిక్ లిఫ్టర్ జాక్
టీఎస్‌వీఏ.శివరాం	జెడ్పీఎస్ఎస్, తనికెళ్ల	వర్షం నుంచే పంటలను కాపాడే పరికరం
టి.భవ్యశ్రీ	జీహెచ్ఎస్, మధిర	అంబులెన్స్ ఆన్ హైడ్రాలిక్‌వీల్
ఎస్.ప్రియ	జెడ్పీహెచ్ఎస్, చెన్నారం	అల్ట్రాసోనిక్ హెల్మెట్ ఫర్ ది హియరింగ్ ఇంపెయిర్డ్
పి.మనోజ్	బాలభారతి విద్యాలయం, ఖమ్మం	లిక్విడ్ ఫెర్టిలైజర్ స్ప్రేయర్
టి.అజయ్	బాలభారతి విద్యాలయం, ఖమ్మం	యూరియా స్ప్రేయర్
సీహెచ్.జగదీష్	జెడ్పీహెచ్ఎస్, ఇల్లూరు	హోం మేడ్ ఎయిర్ కూలర్
ఎస్.సిద్ధార్థ	డీపీవీ హైస్కూల్, ఖమ్మం	ఉమెన్ సేఫ్టీ హెయిర్ రబ్బర్ బ్యాండ్
జి.రేష్మిత	క్రియేటివ్ హైస్కూల్, ఖమ్మం	ఆటోమెటిక్ ఫైర్ రెసిస్టెన్స్

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

విద్యార్థి	పాఠశాల	ప్రదర్శన అంశం
బి.ప్రణయ్	జెడ్పీహెచ్ఎస్, బురదారాఘవాపురం	మల్టీపర్పస్ వాకర్
టి.సత్యసాయి	ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్	స్మార్ట్ కార్
పి.విశాల్	జెడ్పీహెచ్ఎస్, బురదరాఘవాపురం	పంట పొలాల్లో దోమల నిర్మూలన పరికరం
పి.అఖిల్	నయాబజార్ స్కూల్, ఖమ్మం	సింగరేణి గనుల్లో రెక్యూస్ట్ డివైజ్
కె.మహిమ	జెడ్పీహెచ్ఎస్, బురదరాఘవాపురం	విజువలైజింగ్ మ్యాథ్స్ మోడల్‌సాండ్ అప్లికేషన్
బి.నవదీప్	జెడ్పీహెచ్ఎస్, బురదరాఘవాపురం	వృథా నీటి నుంచి విద్యుత్ ఉత్పత్తి
ఎస్.కే.సాహిద్ పాషా	జెడ్పీహెచ్ఎస్, బురదరాఘవాపురం	ఆల్టర్నేట్ ఎనర్జీ రిసోర్సెస్
ఆర్.అక్షిత	జెడ్పీహెచ్ఎస్, జల్లేపల్లి	పంటల ఆరోగ్యానికి సేంద్రియ ద్రావణాలు - కాషాయాలు
ఎస్.కే.అమీర్ హుస్సేన్	జెడ్పీఎస్ఎస్, కొణిజర్ల	బస్సుల నుంచి చిన్నారుల రక్షణ పరికరం
బి.ఐశ్వర్య	వివాన్ ది స్కూల్, ఖమ్మం	సేంద్రియ సాగుకు ఉపయోగపడే మల్టీపర్పస్ రోబో
కె.సింహిత	వివాన్ ది స్కూల్, ఖమ్మం	వరదల వేళ రక్షణకు ఉపయోగపడే రోబో
ఎస్.రక్షిత	వివాన్ ది స్కూల్, ఖమ్మం	గణితం సులువుగా నేర్చుకోవడం ఇలా..
ఉషశ్రీ	బ్లూసమ్స్ హైస్కూల్, ఖమ్మం	తక్కువ ఖర్చుతో వాక్యూమ్ క్లీనర్ తయారీ
ఐ.బృందా	న్యూ ఇరా స్కూల్, ఖమ్మం	సాంకేతికతతో రిసోర్స్ మేనేజ్‌మెంట్

తలసేమియా చిన్నారులకు అండగా నిలుస్తాం



చిన్నారులతో పోలీస్ అధికారులు, సంస్థ నిర్వాహకులు

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు రక్తం కొరత రాకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామని ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి తెలిపారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మంగళవారం చిన్నారులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ వైద్యుల సూచనల మేరకు చిన్నారులకు తల్లిదండ్రులు క్రమం తప్పకుండా మందులు అందించాలని తెలిపారు. అనంతరం సంకల్ప అధ్యక్షుడు డాక్టర్ రాజేష్ గార్గే జన్మదినం సందర్భంగా తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా, రూ.50 వేల విలువైన యంత్రాన్ని నార్వేకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ నరసయ్యతో పాటు డాక్టర్ డి.నారాయణమూర్తి, సంస్థ బాధ్యులు పి.రవిచందర్, పి.పావని, పి.అనిత, పి.ఉదయ్‌భాస్కర్, దేవి అప్పారెడ్డి, జె.సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని భిక్షాటన



భిక్షాటన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు తక్షణమే మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన ఖమ్మం జిల్లా కేంద్రంలో మంగళవారం భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోగా.. ప్రభుత్వం మారినా విద్యారంగం, విద్యార్థుల సంక్షేమంలో మార్పు రాలేదని చెప్పారు. తక్షణమే బకాయిలు విడుదల చేయని పక్షంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్‌తో పాటు నాయకులు ఎస్.కే.నాగుల్‌మీరా, శివనాయక్, షేక్ సుభాని, వంశీ, మనోజ్, హరికృష్ణ, రాకేష్, ప్రతాప్, గోపి, రోహిత్, సాయి, నరేష్, అయ్యప్ప, నరేష్ ,వెంకటేష్, ఉపేందర్, రవి, గణేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనకపోతే ఆందోళనలు



ఆర్డీఓతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

కల్లూరు/కల్లూరురూరల్: పెనుబల్లి మండలంలోని ఏరుగట్ల గ్రామ రైతుల నుంచి 24 గంటల్లోగా ధాన్యం కొనకపోతే ఆందోళనలు చేపడుతామని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హెచ్చరించారు. కల్లూరులో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై రైతులతో కలిసి ఆయన ఆర్డీఓ రాజేంద్రగౌడ్‌ను కలిసి మాట్లాడారు. ఏరుగట్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రామచంద్రరావు బంజరుకు మార్చడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే, వేంసూరు మండలం కందుకూరులోనూ ధాన్యం కొనలేదని చెప్పారు. ఈమేరకు బుధవారం నుంచి కొనుగోళ్లు చేపడుతామని ఆర్డీఓ రాజేంద్రగౌడ్ వెల్లడించారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కనగాల వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు. కాగా, బుధవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని ఆర్డీఓ ప్రకటించడంతో రైతులు, బీజేపీ నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు, పడిగల మధుసూదన్‌రావు, బొర్రా నరసింహారావు, టి.పుల్లారావు, ఆనంగి నరసింహారావు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



వైరా తహసీల్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

వైరా/బోనకల్: బ్యాంకుల్లో అప్పు ఉన్న ప్రతీ రైతుకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైరా తహసీల్ ఎదుట మంగళవారం రైతులతో కలిసి ధర్నా చేయగా తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులందరి రుణాలు మాఫీ చేయాలన్నారు. జిల్లాలో ఇంకా లక్ష మంది రైతులకు మాఫీ కాకుండా వంద శాతం పూర్తయిందని ప్రభుత్వం ప్రకటించడం సరికాదన్నారు. అలాగే, రుణమాఫీ చేయాలని కోరుతూ రైతులు సీఎంకు రాసిన పోస్ట్‌కార్డులను బోనకల్ నుంచి పంపించారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు వాసిరెడ్డి ప్రసాద్, మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, మేడా శరాబందీ, కిలారు శ్రీనివాసరావు, బాణాల శ్రీనివాసరావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, మల్లికార్జున్, వాసిరెడ్డి నర్సింహారావు, తుళ్లూరి రమేష్, దొండపాటి నాగేశ్వరావు, గుమ్మా ముత్తారావు, కిలారు సురేష్ పాల్గొన్నారు. ఆతర్వాత రైతు సంఘం నాయకులు బోనకల్ మండలం తూటికుంట్లలో పర్యటించి కల్తీ విత్తనాలతో దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలించారు. అధికారులు స్పందించి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన డీపీఓ



సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ ఆశాలత

ముదిగొండ: ఇందిరమ్మ ఇళ్ల కోసం అందిన దరఖాస్తు చేస్తున్న సర్వేను మండలంలోని మేడేపల్లిలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని కుటుంబాల వివరాలు సేకరించారో ఆరా తీసిన ఆమె తప్పులు దొర్లకుండా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎంపీఓ కిషోర్ వాల్మీకి, పంచాయతీ కార్యదర్శి రమ్య, మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

శ్రద్ధగా చదివితేనే మంచి ఫలితాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఓఎస్డీ శ్రీనివాస్‌రెడ్డి

రఘునాథపాలెం: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ కష్టపడి చదవడం ద్వారా మంచి ఫలితాలు సాధించాలని రాష్ట్ర గురుకుల పాఠశాలల ఓఎస్డీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. రఘునాథపాలెంలోని గిరిజన గురుకుల ప్రతిభా కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐఐటీ, నీట్ శిక్షణకు హాజరవుతున్న విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున సబ్జెక్టుల వారీగా సందేహాలను అధ్యాపకులతో నివృత్తి చేయించుకుంటూ శ్రద్ధగా చదవాలని, తద్వారా పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించొచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసిన శ్రీనివాసరెడ్డి మెనూ అమలు, సరుకుల నాణ్యత, తాగునీటి సరఫరాపై ఉద్యోగులకు సూచనలు చేశా రు. ప్రిన్సిపాల్ మల్లెల బాలస్వామి, వైస్ ప్రిన్సి పాల్ మిట్టపల్లి నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పంజాబ్‌లో గిడ్డంగుల సంస్థ చైర్మన్ పర్యటన



పంజాబ్ గిడ్డంగుల సంస్థ బాధ్యులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం వ్యవసాయం: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పంజాబ్ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈసందర్భంగా మంగళవారం ఆయన పంజాబ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ బోర్డు సభ్యులతో సమావేశమయ్యారు. అక్కడ గోదాంల నిర్వహణతో పాటు పలు అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఎండీ కొర్రా లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కామన్ సర్వీస్ సెంటర్ల నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న డీసీఓ గంగాధర్, పక్కన చైర్మన్ వెంకటేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ)ల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, జిల్లా సహకార అధికారి జి.గంగాధర్ సూచించారు. జిల్లాలోని పీఏసీఎస్‌ల కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు సెంటర్ల నిర్వహణపై రెండు రోజుల పాటు ఇస్తున్న శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. జిల్లాలోని 38 పీఏసీఎస్‌ల సిబ్బంది పాల్గొనగా డీసీసీబీ చైర్మన్, డీసీఓ మాట్లాడారు. శిక్షణలో తెలుసుకున్న విషయాలను విధుల్లో అమలు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన మేరకు జిల్లాలోని అన్ని సహకార సంఘాలు కామన్ సర్వీస్ సెంటర్లుగా సమోదయ్యాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే పథకాలు, పాన్, ఆధార్‌కార్డుల నమోదు, రూపే కార్డుల, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన, కిసాన్ శ్రమ యోజన, నేషనల్ పెన్షన్‌స్కీమ్ వంటి పథకాలకు సంబంధించిన సేవలు అందించాల్సి ఉంటుందని చెప్పారు. అనంతరం పలు అంశాలపై ఉద్యోగులు ఫయాజ్, సురేష్ అవగాహన కల్పించారు.

ఖమ్మం వేదికగా ఆర్చరీ, వాలీబాల్ పోటీలు

- సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఖరారు

ఖమ్మం స్పోర్ట్స్: సీఎం కప్ క్రీడోత్సవాల్లో భాగంగా గ్రామస్థాయి పోటీలు ముగియగా మండల స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఆపై జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు క్రీడాంశాల వారీగా వేదికలను స్పోర్ట్స్ అథారి టీ ఆఫ్ తెలంగాణ(శాట్స్) ఖరారు చేసింది. ఈ మేరకు ఖమ్మంలో ఆర్చరీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈనెల 27నుంచి 31వరకు వాలీబాల్, ఈనెల 31నుంచి జనవరి 2వ తేదీ వరకు ఆర్చరీ పోటీలు సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతాయి. వేదికలు ప్రకటించిన నేపథ్యాన పోటీ ల నిర్వహణకు జిల్లా అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించారు. కాగా, రాష్ట్రస్థాయి పోటీలు సబ్ జూని యర్, జూనియర్, సీనియర్స్ కేటగిరీల్లో నిర్వహించే అవకాశముంది.

దాడి కేసులో మూడు నెలల జైలు

ఖమ్మం లీగల్: ఓ వ్యక్తిపై దాడి చేసిన గాయపరిచిన కేసులో ఏపీలోని కృష్ణా జిల్లా చందర్లపాడు మండలం బ్రహ్మబట్లపాలెంకు చెందిన బుడంచర్ల నర్సింహారావుకు మూడు నెలల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఏపూరి బిందుప్రియ తీర్పు చెప్పారు. మంగళవారం వెలువడిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. ముదిగొండ మండలం పెద్దమండవకు చెందిన మంచాల వీరమ్మ - నాగేశ్వరరావు కొనుగోలు చేసిన భూమిలోకి నర్సింహారావు అక్రమంగా ప్రవేశించడమే కాక అడ్డుకున్న నాగేశ్వరరావుపై దాడి చేయగా గాయాలయ్యాయి. ఘటనపై బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు చార్జీషీట్ దాఖలు చేయగా విచారణ అనంతరం నర్సింహారావుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీఓ గంగారాహుల్ వాదించగా ఉద్యోగులు శ్రీకాంత్, ఆదినారాయణ సహకరించారు.

పంట ఫలితం చూడకుండానే కన్నుమూత

- ధాన్యం తీసుకొచ్చిన ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తాకడంతో షాక్
- అక్కడికక్కడే మృతి చెందిన అన్నదాత



దొడ్డ శ్రీను (ఫైల్)



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

చింతకాని: ఆరుగాలం కష్టపడి పండించిన వరి కోతలు పూర్తయ్యాయి.. కల్లెంలో ఆరబెట్టి తేమ తగ్గగానే అమ్మాలని ఆ రైతు ఆశించాడు.. ఈమేరకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి కల్లెంలో పోస్తుండగా ట్రాలీకి విద్యుత్ తీగలు తాకడంతో షాక్‌కు గురైన ఆ అన్నదాత కన్నుమూసిన ఘటన చింతకాని మండలం నర్సింహాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దొడ్డ శ్రీను(52) తన సోదరుడు రమణయ్య కలిసి కౌలుకు చేస్తున్న వరి పంటను మంగళవారం ఉదయం హార్వెస్టర్‌తో నూర్పిడి చేయించారు. అనంతరం ధాన్యాన్ని రమణయ్య ట్రాక్టర్‌లో గ్రామసమీపాన కల్లంలో ఆరబెట్టేందుకు తీసుకొచ్చారు. అయితే, అక్కడ 11 కేవీ విద్యుత్ వైర్లు కిందకు ఉండడాన్ని గమనించని రమణయ్య హైడ్రాలిక్ ద్వారా లేపడంతో ట్రక్కుకు వైర్లు తాకి విద్యుత్ సరఫరా అయింది. అప్పటికే ట్రక్కును పట్టుకున్న శ్రీను విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సీట్లో కూర్చున్న రమణయ్య తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. కాగా, విద్యుత్ సరఫరా కావడంతో ట్రాక్టర్ టైర్లు కూడా పేలిపోగా సమీప రైతులు ఆందోళనకు గురయ్యారు. మృతుడు శ్రీను 15 ఎకరాల మొక్కజొన్న, ఐదెకరాల్లో వరి సాగు చేయగా, ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై నాగుల్‌మీరా పరిశీలించి వివరాలను సేకరించారు. అయితే, 11కేవీ విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ చేతికి అందే ఎత్తులో ఉన్నాయని పలుమార్లు రైతులు, గ్రామస్తులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు శ్రీను ప్రాణాలు కోల్పోయాడని బంధువులు ఆరోపిస్తున్నారు.

వరుసగా ప్రమాదాలు

మండలంలో వరుసగా విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నెల క్రితం లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతు గుని ప్రసాద్ విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మృతి చెందగా సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. అలాగే నర్సింహాపురానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జల్లి రాము విద్యుత్ వైర్లను సరిచేసే క్రమాన ప్రమాదానికి గురై మంచానికే పరిమితమయ్యాడు. ఇలా వరుస ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెరుగైన వైద్యసేవలు అందించండి

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ సూచించారు. సత్తుపల్లి ఏరియా ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించారు. అలాగే, సీమాంక్ సెంటర్‌లో చికిత్స కోసం వచ్చిన గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. ఆతర్వాతడయాలసిస్ కేంద్రంతో పాటు వార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. వైద్యులు పి.వసుమతిదేవి, ప్రేమలత, ప్రణయ్, ఉద్యోగులు రామలక్ష్మి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కారేపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి మనస్తాపంతో పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మండలంలోని కొత్తతండాకు చెందిన అజ్మీరా మోతీలాల్(37) కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో సోమవారం పురుగుల మందు తాగిన ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే మంగళవారం మోతీలాల్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై కేసు

ఏన్కూరు: పోలీసులను దూషించడంతో పాటు వారి విధులకు ఆటంకం కలిగించిన యువకుడిపై మంగళవారం కేసు నమోదు చేశారు. మండల కేంద్రంలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా రేపల్లెవాడకు చెందిన బందెల ప్రసన్నసాగర్ మద్యం సేవించి బైక్‌పై వచ్చాడు. ఆయనను అడ్డుకుని ప్రశ్నిస్తుండగానే పోలీసు సిబ్బందిని దూషించడంతో పాటు తన వాహనాన్ని రోడ్డుపై అడ్డుగా పెట్టడంతో మిగతా వారు ఇబ్బంది పడ్డారు. ఈమేరకు సిబ్బంది ఫిర్యాదుతో ప్రసన్నసాగర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రఫీ తెలిపారు.

క్లుప్తంగా...

17 నుంచి శ్రీవారికి తిరుప్పావై

16 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాసం

తిరుమల: తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం డిసెంబరు 16న ప్రారంభం కానుంది. ఆరోజు ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం కానున్న నేపథ్యంలో డిసెంబరు 17 నుంచి స్వామివారికి నిర్వహించే సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. జనవరి 14తో ధనుర్మాస ఘడియలు ముగియనున్నాయి. ఈసందర్భంగా శ్రీవారికి విశేష కైంకర్యాలు నిర్వహిస్తారు. బిల్వ పత్రాలతో సహస్ర నామార్చన చేస్తారు. శ్రీవిల్లి పుత్తూరు చిలుకలను ప్రతి రోజూ స్వామివారికి అలంకరిస్తారు. విశేష నైవేద్యాలుగా దోశ, బెల్లం దోశ, సుండలు, సీరా, పొంగల్ వంటి ప్రసాదాలను నివేదిస్తారు.

రద్దీ రోజుల్లోనూ మల్లన్న స్పర్శ దర్శనం

శ్రీశైలం టెంపుల్: రద్దీ రోజుల్లోనూ శ్రీశైల మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తూ దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలువురు భక్తుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో, ప్రభుత్వ సెలవు దినాలు తదితర రద్దీ రోజుల్లోనూ నిర్దిష్ట వేళల్లో మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మల్లన్న స్పర్శదర్శనం ఉంటుందన్నారు. గతంలో మాదిరిగానే స్పర్శ దర్శనం టికెట్లను కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే పొందాల్సి ఉంటుందన్నారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డి



సాక్షి, హైదరాబాద్: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా సాంబశివారెడ్డికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆయన అదే విభాగం జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ జి.వైజయంతి గత నెల 30న పదవీ విరమణ చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

'సానా'కు శానా చేస్తున్నారు..

రాజ్యసభ అవకాశం ఇవ్వడంపై టీడీపీలో తీవ్ర విమర్శలు

- ఒత్తిళ్లకు సీఎం చంద్రబాబు లొంగిపోయారని నేతల ఆగ్రహం
- సీబీఐ, ఈడీ కేసులున్న వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ఆందోళన
- కొత్త నేతను అందలం ఎక్కిస్తే తమ పరిస్థితి ఏమిటని సీనియర్ల నిలదీత
- ఎవరెన్ని చెప్పినా అలాంటి నేతలే అవసరమని సీఎం స్పష్టీకరణ



సాక్షి, అమరావతి : మనీ లాండరింగ్, హవాలా కేసులు సహా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర ఉన్న సానా సతీష్‌కు సీఎం చంద్రబాబు రాజ్యసభ సీటు ఇవ్వడంపై ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. లాబీయింగ్, అవినీతి వ్యవహారాలతో అంటకాగే వ్యక్తికి కీలక పదవి ఇవ్వడం సరికాదంటూ టీడీపీ శ్రేణులు సోషల్ మీడియాలో, వ్యక్తిగత సంభాషణల్లో విరుచుకుపడుతున్నారు. పార్టీ కోసం సుదీర్ఘ కాలం నుంచి పని చేసిన వారిని పట్టించుకోకుండా కొత్తగా పార్టీలోకి వచ్చి పెత్తనం చెలాయిస్తున్న సానా సతీష్‌కు ఉన్నత పదవి ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. ఆయనకు పదవి ఇస్తున్నారని కొన్ని రోజుల క్రితమే తెలియడంతో చాలా మంది ముఖ్య నేతలు చంద్రబాబును కలిసి తమ అసంతృప్తి వెలిబుచ్చారు. ఎంతో మంది సీనియర్లు ఉండగా, తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని పరిగణనలోకి తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే తమ లాంటి సీనియర్ల పరిస్థితి ఏమిటని.. క్యాడర్‌కు, నాయకులకు ఏం సమాధానం చెప్పాలని అడిగినట్లు తెలిసింది. గత ఎన్నికల్లో, అంతకు ముందు.. పార్టీకి భారీగా నిధులు ఇచ్చిన వారికి ఇప్పుడు న్యాయం చేయక తప్పదని ఆయన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. లోకేశ్ పాదయాత్రలో సతీష్ లాంటి నేతలు చాలా ఉపయోగపడ్డారని, వారు డబ్బు ఖర్చు చేశారు కాబట్టే అధికారంలోకి వచ్చాక ప్రతిఫలం ఇస్తున్నామని స్పష్టం చేసినట్లు.. అంతటితో ఆగకుండా పార్టీలో కొత్త తరానికి అవకాశం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసినట్లు తెలిసింది. చంద్రబాబు స్పందించిన తీరుతో సీనియర్ నాయకుల్లో ఇంకా ఆగ్రహం పెరిగిపోయింది. పార్టీ చంద్రబాబు చేతుల్లో లేదని, లోకేశ్ కోటరీ చేతుల్లో ఉందని చర్చించుకుంటున్నారు. లోకేశ్ కోటరీలో అత్యంత కీలకంగా ఉంటూ బదిలీలు, కాంట్రాక్టులు సహా అన్ని వ్యవహారాలను సానా సతీష్ చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో ఆయన పేరును రాజ్యసభ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు ప్రకటించక తప్పలేదంటున్నారు.

విస్తుగొలిపే తీవ్ర ఆరోపణలు

- సానా సతీష్‌పై మనీ లాండరింగ్ అభియోగాలుండడంతో సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. ఈ కేసులకు సంబంధించి 2019 జూలైలో ఆయన్ను ఈడీ అరెస్టు చేసి జైలుకు పంపింది.
- మనీ లాండరింగ్, హవాలా కేసుల్లో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న మీట్ వ్యాపారి మొయిన్ ఖురేషీతో సతీష్‌కు సన్నిహిత సంబంధాలున్నట్లు తేలింది. ఖురేషీతో కలిసి అక్రమ వ్యాపారాలు కూడా చేసినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే తనపై ఉన్న మనీ లాండరింగ్ కేసుల నుంచి తప్పించుకునేందు ఖురేషీ ద్వారా సీబీఐ అధికారులకు సతీష్ లంచం ఇచ్చినట్లు స్పష్టమైంది.
- అదే సమయంలో సీబీఐ డైరెక్టర్‌గా పని చేసిన రాకేష్ ఆస్థానా, మరో సీబీఐ అధికారి అలోక్ వర్మ మధ్య చిచ్చుపెట్టి.. ఏకంగా సీబీఐనే వివాదంలోకి లాగిన చరిత్ర సతీష్‌ది. తనను కేసు నుంచి తప్పించేందుకు సీబీఐ డిప్యూటీ డైరెక్టర్ రాకేష్ ఆస్థానాకు రూ.2 కోట్లు లంచం ఇచ్చినట్లు స్పష్టమవడంతో ఈడీ అధికారులు ఆయన్ను అరెస్టు చేశారు.
- తనపై ఉన్న ఆరోపణలను కొట్టేయాలంటూ ఈ ఏడాది జులైలో సానా సతీష్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా దాన్ని కోర్టు కొట్టివేసింది. ఇలా తీవ్ర స్థాయి ఆరోపణలున్న వ్యక్తిని విచారించాల్సిందేనని స్పష్టం చేసింది.

సబ్ ఇంజనీర్ నుంచి కోట్లకు పడగలెత్తి..

- కాకినాడకు చెందిన సానా సతీష్ మొదట్లో విద్యుత్ శాఖలో సబ్ ఇంజనీర్‌గా పని చేశారు. ఉద్యోగం వదిలేశాక అక్రమ వ్యాపారాలతో కోట్లు కూడబెట్టినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే మనీ లాండరింగ్, హవాలా కేసులు నమోదయ్యాయి. అలాంటి వ్యక్తి చంద్రబాబు తనయుడు, మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడిగా మారిపోయారు.
- అక్రమంగా సంపాదించిన డబ్బును ఖర్చు చేసి వారికి బాగా దగ్గరయ్యారు. లోకేశ్ పాదయాత్ర ఖర్చును చాలా వరకు సతీష్ భరించినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీగా డబ్బు సమకూర్చినట్లు తెలిసింది. చాలా వ్యవహారాల్లో లోకేశ్ వెన్నంటే ఉండి అన్నీ సమకూర్చినట్లు చెబుతున్నారు. దీంతో ప్రస్తుత ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా అవతరించారు.
- మంత్రి పదవులు, ఉన్నతాధికారుల పోస్టింగ్‌లు, బదిలీలు, కాంట్రాక్టులు ఇతర అనేక వ్యవహారాల్లో ఆయన ప్రమేయం ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పదవి ఆయన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఇప్పుడు ఏకంగా కాకలు తీరిన సీనియర్ నేతలను కాదని రాజ్యసభ సీటునే తన్నుకుపోయారు.

ప్రశ్నిస్తే పనిపడతా!

- బీసీ నేతల మధ్య చంద్రబాబు చిచ్చు
- కేవీ రావుకు వ్యతిరేకంగా యనమల లేఖాస్త్రం
- దీనిపై రెడ్డి సుబ్రహ్మణ్యం ఘాటు వ్యాఖ్యలు
- ఇదంతా సీఎం సూచనల మేరకే అంటున్న నేతలు
- యనమల టార్గెట్‌గా సోషల్ మీడియాలోనూ పోస్టులు

సాక్షి, అమరావతి : రాజకీయ ప్రయోజనాల కోసం ఎంతకైనా తెగించే చంద్రబాబు ఇప్పుడు పార్టీలోని ఇద్దరు బీసీ నేతల మధ్య చిచ్చు పెట్టారు. సుదీర్ఘ కాలం నుంచి తనకు బలమైన మద్దతుదారుగా ఉన్న సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాలను జీర్ణించుకోలేక ప్రశ్నించడంతో ఆయనపైకి మరో సీనియర్ నేత, శాసన మండలి మాజీ డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యంను ఉసిగొల్పినట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. అంతేకాకుండా టీడీపీ సోషల్ మీడియా కూడా యనమలకు వ్యతిరేకంగా తీవ్ర స్థాయి ఆరోపణలతో ట్రోల్ చేస్తోంది. దీనికంతటికీ కాకినాడ పోర్టు వ్యవహారంలో చంద్రబాబు వైఖరికి విరుద్ధంగా యనమల రామకృష్ణుడు ఆయనకు లేఖ రాయడమే కారణం. కాకినాడ పోర్టుకు చెందిన కేవీ రావు చౌదరికి చంద్రబాబు మద్దతు పలుకుతూ రాజకీయంగా ఆయన్ను పావులా వాడుకుంటున్నారు. కానీ యనమల మాత్రం తాను రాసిన లేఖలో కేవీ రావు చౌదరి కాకినాడ సెజ్ భూముల ద్వారా వేల కోట్ల లబ్ధి పొందారని.. బీసీ, మత్స్యకార రైతులకు అన్యాయం చేశారని ఆరోపించారు. తనను ధిక్కరిస్తూ లేఖ రాయడంతో చంద్రబాబు.. యనమలను ప్రశ్నించకుండా ఇతర బీసీ నేతలను ఆయనపైకి ప్రయోగించినట్లు ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే రెడ్డి సుబ్రహ్మణ్యం బహిరంగంగా యనమల రామకృష్ణుడిపై ఆరోపణలు గుప్పించారు. 40 ఏళ్లుగా యనమల బీసీల గురించి పట్టించుకోలేదని, ఇప్పుడు తనకు పదవి ఇవ్వలేదనే కారణంతో చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆయనకు తోడుగా మరికొందరు కింది స్థాయి నేతలు కూడా యనమలపై విమర్శలు చేశారు. టీడీపీ సోషల్ మీడియా అయితే యనమల పార్టీలో ఉన్న విషయాన్ని కూడా మరచిపోయి ఆడేసుకుంటోంది.



చంద్రబాబుకు తెలియకుండానే తిడతారా?

పార్టీలో తన స్థాయి ఉన్న ఒక సీనియర్ బీసీ నాయకుడిని, మరో సీనియర్ బీసీ నాయకుడు బహిరంగంగా తిట్టారంటే అందుకు చంద్రబాబు పరోక్ష అనుమతి కచ్చితంగా ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యనమలకు వ్యతిరేకంగా పార్టీలోనే ఇంత జరుగుతున్నా, చంద్రబాబు స్పందించక పోవడాన్ని బట్టి ఆయన అభిమతం ప్రకారమే ఇదంతా జరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. మరోవైపు కొందరు బీసీ నేతలు యనమలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. చంద్రబాబుకు ఆది నుంచి తోడు, నీడగా ఉన్న నాయకుడిని ఇలా అవమానించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇలా పార్టీలోనే బీసీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకునే పరిస్థితి ఏర్పడినా, చంద్రబాబు మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం టీడీపీలో జరుగుతున్న పరిణామాల పట్ల యనమల రామకృష్ణుడు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తనలాంటి సీనియర్లను పూర్తిగా పక్కన పెట్టేయడంతో ఆయన ఆగ్రహంతో రగిలిపోతున్నారు. దీనికితోడు కాకినాడ పోర్టు, సెజ్ విషయంలో కేవీ రావు చౌదరికి అనుకూలంగా వ్యవహరించడం, రాజ్యసభ స్థానాలను లాబీయిస్టులకు కట్టబెడుతుండడంతో తట్టుకోలేక ఆయన తొలిసారిగా చంద్రబాబును ధిక్కరించి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడవడం నుంచి చంద్రబాబుతో కలిసి పని చేసిన యనమల లాంటి నాయకుడు తిరుగుబాటు స్వరం వినిపించడంతో పార్టీలో గందరగోళం నెలకొంది.

అది విప్లవాత్మక ఆవిష్కరణ

గుండె వాల్వ్‌ల చికిత్సలో 'మైవాల్ ఆక్టోప్రో'పై కార్డియాలజిస్టులు

సాక్షి, హైదరాబాద్: 'మైవాల్ ఆక్టో ప్రో ట్రాన్స్ క్యాథెటర్ హార్ట్ వాల్వ్' అనే ఉపకరణం గుండె చికిత్సల్లో విప్లవాత్మక మార్పు తెస్తుందని కార్డియాలజిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ ఉపకరణాన్ని కనుగొనడం గుండె చికిత్సల్లో కీలక మైలురాయిగా అభివర్ణించారు. నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఇటాలియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ, పీసీఆర్ లండన్ వాల్వ్స్–2024 వంటి అంతర్జాతీయ వేదికలపై ఓ భారత కంపెనీ ఉపకరణాన్ని పలువురు కొనియాడటం భారతీయులకు ఎంతో గర్వకారణమని చెన్నైకు చెందిన డాక్టర్ అనంతరామన్, డాక్టర్ జాన్ జోస్, డాక్టర్ సెంగొట్టువేలు ప్రశంసించారు. గుండె చికిత్సల ఉపకరణాలను అభివృద్ధి చేస్తున్న 'మెరిల్ లైఫ్ సైన్సెస్' సంస్థ ఆధ్వర్యంలో ఈ ఉపకరణం రూపుదిద్దుకుంది. ఈ ఉపకరణం ద్వారా గుండెను పూర్తిగా తెరవకుండానే చిన్న గాటుతో 'అయోర్టిక్ వాల్వ్'లో వచ్చే లోపాలకు చికిత్స అందించవచ్చని మెరిల్ లైఫ్ సైన్సెస్ ఓ ప్రకటనలో పేర్కొంది.

14న దుర్గమ్మ కలశజ్యోతి మహోత్సవం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు కలశజ్యోతి మహోత్సవం జరగనుంది. మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు విజయవాడ, సత్యనారాయణపురం శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుంచి భవానీలు, అమ్మవారి భక్తులు జ్యోతులను పట్టుకుని ఇంద్రకీలాద్రికి వస్తారు. భవానీలు తమ కలశజ్యోతులను కనకదుర్గ నగర్‌లో సమర్పించడంతో పాటు మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. కలశ జ్యోతుల నేపథ్యంలో శనివారం రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పిస్తారు.

జిల్లా వార్తలు

ఆర్థిక చేయూత అభినందనీయం



పీడీ తల్లికి చెక్కు అందిస్తున్న డీఈఓ శర్మ, పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం సహకారనగర్: ముదిగొండ మండలం మేడేపల్లి జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ ఇటీవల మృతి చెందగా పీఆర్‌టీయూ సంక్షేమ నిధి నుంచి రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. ఈ మేరకు చెక్కును శ్రీనివాస్ తల్లి వెంకమ్మకు డీఈఓ సోమశేఖరశర్మ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పీఆర్‌టీయూలో క్రియాశీల సభ్యత్వం పొందిన సభ్యులు ఏదైనా కారణంతో మృతి చెందితే రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు, డీసీఈబీ కార్యదర్శి నారాయణ, ఎంఈఓ శైలజాలక్ష్మి, నాయకులు కట్టా శేఖర్‌రావు, టి.ప్రసాద్, జి.వీరయ్యచౌదరి, గుడిపూడి శ్రీనివాసరావు, తాళ్లూరి చంద్రశేఖరరావు, ఫిజికల్ డైరెక్టర్లు కె.రాము, నాగుల్‌మీరా, కృష్ణయ్య పాల్గొన్నారు.

15న ఉమ్మడి జిల్లాస్థాయి ఆర్చరీ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: సబ్ జూనియర్ బాలబాలికల విభాగంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఆర్చరీ జట్టు ఎంపికకు ఈనెల 15న పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే పోటీలకు క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9గంటలకు హాజరుకావాలని సూచించారు. ఇండియన్ రౌండ్, కాంపౌండ్ రౌండ్ అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వివరాలకు 93946 43139, 94945 43139 నంబర్లలో సంప్రదించాలని వెల్లడించారు.

నర్సింగ్ అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లిలోని జిల్లా మహిళా ప్రాంగణంలో నర్సింగ్ శిక్షణ ఇచ్చేందుకు అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజర్ వి.విజేత తెలిపారు. పబ్లిక్ హెల్త్ నర్స్ పోస్టుకు రెండేళ్ల అనుభవం కలిగి, ఎమ్మెస్సీ లేదా బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులని, రిటైర్డ్ అధ్యాపకులకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 13వ తేదీలోగా మహిళా ప్రాంగణంలో దరఖాస్తులు అందజేయాలని, ఇతర వివరాలకు 76600 22512 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీల్లో పనులు సాగేదెలా?

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరులో కొనసాగుతున్న జాప్యంతో గ్రామ పంచాయతీల కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఎదురవుతోంది. ఈ పరిణామం పంచాయతీల అభివృద్ధిపైనా ప్రభావం చూపిస్తోంది. దీంతో ప్రభుత్వమే నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనం జమ చేసేందుకు సన్నద్ధమైంది. అందుకు అనుగుణంగా వివరాలు ఆన్‌లైన్ చేయడంతో కార్మికులు సంబురపడినా.. నిబంధనల మేరకు కొందరిని తగ్గిస్తుండటంతో ఆందోళన నెలకొంది. – ఇల్లెందురూరల్

ఆన్‌లైన్ వేతనం చెల్లింపు ప్రక్రియలో గందరగోళం

- పంచాయతీల్లో ఎంపీడబ్ల్యూల కుదింపునకు సిద్ధం
- ఇప్పటికే గ్రీన్ అంబాసిడర్లు, డంప్‌షెడ్డు వర్కర్ల తొలగింపు
- ఆందోళనకు సిద్ధమవుతున్న కార్మిక సంఘాలు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు



విధుల నుంచి తొలగించారని వాపోతున్న గ్రీన్ అంబాసిడర్లు

ఆరేళ్ల కిందట నియామకం

ప్రజల వద్దకు పరిపాలన చేర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం 2018లో భౌగోళిక స్వరూపం, జనాభా ప్రాతిపదికన కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే ఇల్లెందు మండలంలో జీపీల సంఖ్య 29కి చేరింది. 2019 జనవరిలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్ (ఎంపీడబ్ల్యూ) పేరిట కార్మికులను నియమించారు. ప్రారంభంలో జీఓ 51కి అనుగుణంగా ప్రతీ 500 జనాభాకు ఒక కార్మికుడు ఉండాలన్న నిబంధన ఉండగా.. ప్రభుత్వం పంచాయతీలకు ట్రాక్టర్ సమకూర్చడంతో చెత్త సేకరణ, తరలింపు కోసం అదనపు కార్మికుల అవసరం ఏర్పడింది. ఈ మేరకు అప్పటి ప్రజాప్రతినిధులు నిబంధనలను పక్కన పెట్టి అదనంగా ఇద్దరు, ముగ్గురు కార్మికులను నియమించుకున్నారు. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సకాలంలో విడుదల కావడంతో వేతనాలు చెల్లించారు.

ఇప్పుడు ఎదురుచూపులు

సుమారు ఏడాదిగా జీపీలకు పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరులో జాప్యం జరుగుతోంది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు నెలల తరబడి వేతనాల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం గ్రామపంచాయతీల ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ ఇతరత్రా పనులకు సర్దుబాటు చేస్తున్నారు. కార్మికుల వేతనం విషయంలో నిబంధనల పేరిట జాప్యం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

గ్రీన్ అంబాసిడర్ల తొలగింపు

గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం మొక్కల ఆలనపాలన చూసేందుకు నెలకు రూ.5 వేల వేతనంతో కార్మికులను ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా 2021లో నియమించింది. గతేడాది ఏప్రిల్ నుంచి పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతను గ్రామపంచాయతీలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అప్పటి వరకు పనిచేసిన గ్రీన్ అంబాసిడర్లనే కొనసాగిస్తూ అధికారులు పంచాయతీ ద్వారా వేతనాలు చెల్లించారు. ఇంతేకాకుండా డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేయడం, వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేపట్టేందుకు ప్రత్యేకంగా కార్మికులను నియమించింది. వీరికి కూడా పంచాయతీ ద్వారా వేతనాలు చెల్లించారు. కానీ, తాజాగా వీరిని పంచాయతీ అధికారులు విధుల నుంచి తొలగించారు.

జాబితాలో పేర్లు ఏవీ?

గ్రామపంచాయతీల కార్మికులకు నేరుగా ఆన్‌లైన్ ద్వారా వేతనాలు చెల్లించాలని నిర్ణయించిన ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ల వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఆదేశించింది. దీంతో నెలనెలా వేతనాలు వస్తాయని కార్మికులు ఆశించారు. కానీ, జీఓ 51 ప్రకారం ప్రతీ 500 జనాభాకు ఒకే కార్మికుడిని నియమించాలనే నిబంధన ఉన్నా గతంలో అదనంగా కార్మికులను నియమించారు. ఇప్పుడు ఆన్‌లైన్ ప్రక్రియలో కొందరి పేర్లు గల్లంతవడంతో కార్మికుల్లో ఆందోళన ప్రారంభమైంది. ఇప్పటికిప్పుడు విధుల నుంచి తొలగించే ప్రయత్నం చేయకున్నా ఎప్పటికైనా చేస్తారని.. తద్వారా తమ ఉపాధి మాటేమిటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు.

సిబ్బంది తొలగింపు అన్యాయం



గ్రామపంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు, డంప్‌షెడ్డు వర్కర్ల తొలగింపు సరికాదు. చేసేందుకు పనులు దొరక్క వేతనం తక్కువే అయినా అంకిత భావంతో పనిచేస్తున్న కార్మికులకు ఉపాధిని దూరం చేయడం అన్యాయం. మళ్లీ వారిని నియమించి ఉపాధి కల్పించాలి.

–సామేలు, మల్టీపర్పస్ వర్కర్, రొంపేడు

కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం



ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపిస్తూ పంచాయతీల్లో కార్మికులను తొలగించే ప్రయత్నం చేస్తే ఉద్యమిస్తాం. ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియలో కొందరి పేర్లు తొలగించారు. ఇకనైనా కార్మికులందరి పేర్లు జాబితాలో చేర్చని పక్షంలో నిరవధిక సమ్మె చేయాల్సి వస్తుంది.

–జటంగి వెంకన్న, మల్టీపర్పస్ వర్కర్, పోలారం

మిగిలింది నాలుగు నెలలే...

- సింగరేణిలో ఇప్పటివరకు 91శాతం బొగ్గు ఉత్పత్తి
- నవంబర్‌లో 99శాతంగా ఉత్పత్తి నమోదు
- భూగర్భ గనుల్లో 78శాతం.. ఓసీల్లో 101శాతం



ఓసీలోని డంపర్‌లో బొగ్గు లోడ్ చేస్తున్న పొక్లెయినర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) ఇప్పటివరకు బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడగా మిగిలిన నాలుగు నెలల్లో లక్ష్యాన్ని చేరుకోవాలనే భావనతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మిగిలిన సమయంలో 32 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరగాల్సి ఉండడంతో రోజువారీ, నెలవారీ లక్ష్యాలను నిర్దేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను ఏప్రిల్ నుండి నవంబర్ వరకు ఎనిమిది నెలల్లో 43.89 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా 40.15 మిలియన్ టన్నులే(91 శాతం) నమోదైంది. మిగిలిన నాలుగు మాసాల్లో నెలకు 8 మిలియన్ టన్నులు, రోజుకు 2.70 లక్షల టన్నుల ఉత్పత్తి చేయాలి. కానీ ప్రస్తుతం రోజుకు 2.23 లక్షల టన్నులే ఉత్పత్తి జరుగుతుండడంతో లక్ష్యసాధనపై ప్రత్యేక దృష్టి సారించారు.


నవంబర్‌లో ఇలా..

గడిచిన నవంబర్‌లో 22 భూగర్భగనులు, 18 ఓపెన్ కాస్ట్‌ల ద్వారా 63,72,500 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 63,10,733 లక్షల టన్నుల ఉత్పత్తి(99శాతం) నమోదైంది. ఓసీల్లో 58,89,000 టన్నుల లక్ష్యానికి 59.34,262 టన్నుల(101శాతం) ఉత్పత్తి సాధిస్తే భూగర్భగనుల్లో మాత్రం 4,83,500 టన్నుల లక్ష్యానికి 3,76,471 టన్నుల(78 శాతం) ఉత్పత్తి చేయగలిగారు. తద్వారా భూగర్భ గనుల్లో 22శాతం వెనుకంజలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గతేడాది కంటే వెనుకంజ..

సంస్థ వ్యాప్తంగా గడిచిన ఎనిమిది మాసాల్లో 40.15 టన్నుల బొగ్గు ఉత్పత్తితో 91శాతంగా నమోదైంది. గత ఏడాది ఇదే సమయానికి 43.18 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించారు. అంటే గతేడాదితో పోలిస్తే సుమారు 3.03 లక్షల టన్నులు వెనుకంజలో ఉంది. ఇక గడిచిన ఎనిమిది నెలల్లో ఏరియాల వారీగా పరిశీలిస్తే ఇల్లెందు ఏరియా 23.11లక్షల టన్నుల్లో 29,10,460 లక్షల టన్నుల (126శాతం) బొగ్గు ఉత్పత్తితో సింగరేణి వ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచింది. ఆతర్వాత ఆంధ్రియాల 3,46,500 లక్షల టన్నులకు 3,58,609 టన్నులతో రెండో స్థానం దక్కించుకుంది. ఆతర్వాత కొత్తగూడెం ఏరియా 97 శాతం, మణుగూరు 90, బెల్లంపల్లి 91, మందమర్రి 72, శ్రీరాంపూర్ 73, ఆర్జీ–1 89, ఆర్జీ–2 98, ఆర్జీ–3 97, భూపాలపల్లి ఏరియా 74శాతం ఉత్పత్తి సాధించాయి.

రానున్న నాలుగు నెలలే కీలకం



ప్రస్తుత ఆర్థిక మాసంలో మిగిలిన నాలుగు నెలల్లో ప్రతీ నిముషం విలువైనదిగా భావించి లక్ష్యసాధనకు పాటు పడాలి. ప్రతిఒక్కరు విధిగా ఎనిమిది గంటల పాటు పనిచేయడమే కాక కనీసం 18 గంటలు యంత్రాలు వినియోగించాలి. ఇదే సమయాన నాణ్యత, రక్షణకు ప్రాధాన్యం ఇస్తూ రోజువారీ లక్ష్యాలను సాధిస్తేనే వార్షిక లక్ష్యాలను చేరుకోవచ్చు.

– ఎన్.బలరామ్, సింగరేణి సీఎండీ

నవంబర్‌లో ఏరియాల వారీగా ఉత్పత్తి వివరాలు

ఏరియా	లక్ష్యం (టన్నుల్లో)	ఉత్పత్తి (టన్నుల్లో)	శాతం
ఇల్లెందు	3,02,000	4,81,830	160
బెల్లంపల్లి	2,50,000	3,38,613	135
కొత్తగూడెం	12,65,500	13,73,482	110
మణుగూరు	11,58,500	11,91,235	103
ఆర్జీ-1	4,51,700	4,65,234	103
ఆర్జీ-3	5,68,000	5,61,976	99
శ్రీరాంపూర్	5,75,200	5,04,105	88
భూపాలపల్లి	4,41,700	3,80,811	86
ఆర్జీ-2	10,39,000	8,01,708	77
మందమర్రి	3,12,500	1,88,851	60
ఆంధ్రియాల	8,400	22,888	272

ఉత్పత్తిలో కొత్తగూడెం టాప్

సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలో కొత్తగూడెం ఏరియాకు సంబంధించి నవంబర్‌లో 13,73,482 టన్నుల ఉత్పత్తితో రికార్డు నమోదు చేసింది. అలాగే, గడిచిన 110 శాతం సాధించి సింగరేణి వ్యాప్తంగా రికార్డ్ సాధించింది. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 87,02,014 టన్నులు ఉత్పత్తి సాధించింది. మిగతా ఏరియాలతో పోలిస్తే ఇక్కడ ఒక భూగర్భగని, రెండు ఓసీల్లో 2,400 మంది కార్మికులే ఉన్నా గణనీయమైన ఉత్పత్తి నమోదు కావడం విశేషం.